సాక్షి
విజయనగరం

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



జనం గుండెలో ఓ జ్ఞాపకం

వైఎస్సార్... భౌతికంగా దూరమైనా జనం గుండెల్లో గుడికట్టుకుని ఉన్నారు. ఆయన వర్ధంతి రోజున ఘననివాళులర్పించేందుకు జిల్లా ప్రజలు సిద్ధమవుతున్నారు. - IIలో



శుభకార్యానికి వెళ్తూ అనంతలోకాలకు..

అగనంపూడిలో శుభకార్యానికి వెళ్తున్న భార్యాభర్తల స్కూటీని బస్సు ఢీ కొనడంతో భర్త అక్కడికక్కడే దుర్మరణం చెందగా భార్య స్వల్పగాయాలతో బయటపడింది. - IIలో

పశువైద్యశాల డీడీగా మహలక్ష్మి



విజయనగరం ఫోర్ట్: బహూళార్థ పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా డాక్టర్ మహలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీడీగా పనిచేసిన భాస్కరరావు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. పాడేరు సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న మహలక్ష్మి ఉద్యోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

న్యూస్‌రీల్

ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు 7న కౌన్సెలింగ్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, వైద్య విధాన్ పరిషత్ పరిధిలో ఆఫీస్ సబార్డినేట్‌పోస్టుల ఖాళీల భర్తీకి ఈ నెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు అర్హులైన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 14 పోస్టులకు, డీసీహెచ్‌ఎస్‌కు సంబంధించి ఒక పోస్టుకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు.

రక్తదానంలో ఆయనే మా 'స్టార్'

- 84 సార్లు రక్తదానం చేసిన ఉపాధ్యాయుడిని సత్కరించిన తోటి ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది



విజయమోహన్‌రావు మాస్టార్‌ను అభినందిస్తున్న తెర్లాం హైస్కూల్ హెచ్‌ఎం రమేష్, వైద్య సిబ్బంది

తెర్లాం: రక్తదానం ప్రాణదానంతో సమానం. దీనిని 'గురు'తర బాధ్యతగా భావించి 84 సార్లు రక్తదానం చేసిన తెర్లాం మండలం నందబలగ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు మిందివిజయమోహన్‌రావును హెచ్‌ఎం ఎస్ఎస్ఎస్ రమేష్, ఏఎన్‌ఎంలు ప్రశాంతి, ప్రభావతి, తోటి ఉపాధ్యాయులు శుక్రవారం సత్కరించారు. ఆయన సామాజిక స్ఫృహను కొనియాడారు. రక్తదాత విజయమోహన్‌రావు మాట్లాడుతూ రక్తదానం చేయడం గొప్పవరమని, ప్రతీ ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ నియామక ప్రక్రియ పరిశీలన



రన్నింగ్ పోటీలను పర్యవేక్షిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ, ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: ఎస్‌ఎల్‌పీఆర్‌బీ ఆధ్వర్యంలో స్టైపండరీ క్యాడెట్ ట్రైనీ, ఆర్‌ఎస్‌ఐల నియామక ప్రక్రియలో భాగంగా విశాఖ కైలాసగిరిలో నిర్వహిస్తున్న ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలను ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం స్వీయపర్యవేక్షణ చేశారు. మొత్తం 685 మంది మహిళా అభ్యర్థులకు 588 మంది హాజరయ్యారని తెలిపారు. 1600, 100 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ, నోడల్ అధికారి దిలీప్ కిరణ్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, మినిస్ట్రీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీలతో ఆటాపాటా..



సీతంపేట గిరిజన సంక్షేమ పాఠశాల బాలికలతో కలిసి ట్రైనీ ఐఏఎస్‌ల నృత్యప్రదర్శన

భామిని/సీతంపేట: ట్రైనీ ఐఏఎస్‌లు ఆదివాసీలతో మమేకమయ్యారు. సంప్రదాయ నృత్య ప్రదర్శనలో అడుగు కలిపారు. వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపారు. ముందుగా భామిని మండలం సవరపాడు, బొడ్డగూడల్లోని జీసీసీ డిపోలలో నిత్యావసర సరుకుల నిల్వలు, రేషన్ సరుకుల పంపిణీ తీరును పరిశీలించారు. సవరపాడు పాఠశాలలో గిరిజన విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. సీతంపేట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులతో కలిసి నృత్యం చేశారు. వారివెంట డిప్యూటీ ఈఓ లిల్లీరాణి ఉన్నారు.

గెడ్డగూడలో పులిసంచారం

సీతంపేట: గెడ్డగూడ సమీపంలో పులి సంచరిస్తున్నట్టు ఆ గ్రామ గిరిజనులు తెలిపారు. సుక్కయ్య అనే పశువుల కాపరి శుక్రవారం తెల్లవారుజామున పులిని చూసినట్టు చెప్పడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది గెడ్డగూడ ప్రజలను అప్రమత్తం చేశారు. పులి కనిపిస్తే కవ్వింపు చర్యలు చేపట్టవద్దని హెచ్చరించారు.

● శ్రావణ శోభ

శ్రావణమాసం మూడో శుక్రవారం భక్తులు ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. ఆలయాల్లో పూజలు చేశారు. వివిధ అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లను దర్శించుకున్నారు. కుంకుమ పూజలు జరిపారు. చందనం, పంచామృతాలు, వివిధ రకాల ఫలరసాలతో అభిషేకాలు చేశారు. – విజయనగరం టౌన్/చీపురుపల్లి/జామి



బంగారు చీర, పండ్ల అలంకరణలో విజయనగరం కన్యకాపరమేశ్వరి అమ్మవారు




జామి: అలమండలో గాజుల అలంకరణలో దుర్గామాత



జామిలో గాజుల అలంకరణలో వాసవీమాత



నెల్లిమర్ల రూరల్: 50 కేజీల పసుపు కొమ్ముల అలంకరణలో రామతీర్థంలోని మహాలక్ష్మి అమ్మవారు



చీపురుపల్లి: కరెన్సీనోట్ల (రూ.6లక్షలు) అలంకరణలో దర్శనమిచ్చిన చీపురుపల్లి కనకమహాలక్ష్మి

కౌలు రైతుకు ఆర్థిక భరోసా

- చంద్రబాబును రైతులు ఎప్పటికీ నమ్మరు
- రైతుకిచ్చిన మాట నిలబెట్టుకున్నది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే
- అన్నదాత ఆనందంగా ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- 2,603 మంది కౌలు రైతులకు రూ.1.95 కోట్ల రైతు భరోసా సాయం
- 182 మంది రైతులకు రూ.9.88 లక్షల పంట నష్ట పరిహారం చెల్లింపు
- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రైతన్నకు వెన్నుదన్ను



నా పేరు వర్రి సత్యనారాయణ. మాది బొండపల్లి మండలంలోని కొత్తపాలెం. ఎకరా 20 సెంట్లు భూమిని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నా. గతంలో ఉన్న ప్రభుత్వాలు కౌలు రైతులవైపు కన్నెత్తి చూసేవికావు. ప్రకృతి విపత్తుల సమయంలో ఎలాంటి సాయం అందేదికాదు. ఆర్థికంగా నష్టపోయేవారం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మమ్మలను గుర్తించింది. కౌలు గుర్తింపు కార్డులు అందించింది. వైఎస్సార్ రైతు భరోసా కింద సాగుకు పెట్టుబడి సాయం అందిస్తుండడం ఆనందంగా ఉంది. రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి పదికాలాలపాటు చల్లగా ఉండాలి.



కౌలురైతులకు వైఎస్సార్ రైతుభరోసా మెగా చెక్కును అందజేస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

దేవస్థానం భూమి సాగుచేస్తున్నా..



చిత్రంలోని మహిళా రైతుపేరు అనంతల నాగమణి. పాలకొండ మండలంలోని వడమ గ్రామం. దేవదాయ శాఖకు చెందిన రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగుచేస్తోంది. ఆమెను ప్రభుత్వం కౌలురైతుగా గుర్తించింది. సీసీఆర్‌సీ కార్డును అందజేసింది. అంతే.. ఆమె ఖాతాకు వైఎస్సార్ రైతుభరోసా కింద తొలివిడతగా రూ.7,500 నగదు జమయింది. దీంతో ఆమె సంతోషపడుతోంది.

సమయానికి సాగుసాయం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల స్థితిగతులు మారాయి. వ్యవసాయంపై ఆసక్తి పెరిగింది. వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం అందుతోంది. ఊరిలోని ఆర్‌బీకేలోనే ఎరువులు, విత్తనాలు విక్రయిస్తున్నారు. ధాన్యంను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు.

– రెడ్డి సింహాచలం, కె.కొత్తవలస, దత్తిరాజేరు మండలం

ఆనందంగా ఉంది



నా పేరు జి.మజ్జి. పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల గ్రామం. రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాను. ప్రభుత్వం తనను కౌలు రైతుగా గుర్తింపుకార్డు అందించింది. నేడు వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించడం ఆనందంగా ఉంది. ప్రైవేటు వ్యక్తుల వద్ద వడ్డీకి అప్పుతీసుకునే అవసరం తప్పింది. కౌలు రైతులకు పెట్టుబడి సాయంను గతంలో ఏ ప్రభుత్వం అందించలేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరచిపోలేనిది.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

రైతులకు అన్నివిధాలుగా అండగా ఉన్నది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రమేనని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి తీరా అధికారం చేతికొచ్చాక మోసం చేసిన ఘనత చంద్రబాబుకు మాత్రమే దక్కుతుందన్నారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలొస్తున్న సమయంలో వ్యవసాయ రంగాన్ని ఉద్ధరిస్తానంటూ మాయమాటలు చెబుతున్నారని, రైతులు ఆయనను ఎప్పటికీ నమ్మబోరన్నారు. రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని స్పష్టం చేశారు. రైతుల పక్షపాతిగా వ్యవసాయ సాగుకు నిరంతరం ఉచిత విద్యుత్ పంపిణీ చేసిన దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి లక్ష్యాలను నెరవేర్చుతున్నారని వివరించారు. సాధారణ కౌలు రైతులు, దేవదాయ భూములు సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా ఆర్థిక సాయం, అలాగే, మే, జూన్ నెలల్లో కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించే నిధులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం విడుదల చేశారు. వరుసగా ఐదోఏట తొలివిడత నిధులను ఆన్‌లైన్‌లో బటన్‌నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లో జమచేశారు. కార్యక్రమంలో జిల్లా నుంచి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఊరిలోనే సాగు సేవలు

రైతు వ్యవసాయ సాగుకు అవసరమైన సేవలన్నీ ఊరిలో అందించేందుకు రైతు భరోసా కేంద్రాల వ్యవస్థను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మీడియాతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ఆర్థిక రుణ సదుపాయాలను అందుబాటులో ఉంచేందుకు సహకార బ్యాంకింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నట్టు వెల్లడించారు. రైతు ఆనందంగా ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, దానిలో భాగంగానే రైతు భరోసా, పంట నష్ట పరిహారం, పెట్టుబడి రాయితీ సకాలంలో చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తోందని చెప్పారు. భూమిలేని పేదలకు కూడా ఆర్థిక సాయం అందించాలనే ఉద్దేశంతో సీసీఆర్‌సీ కార్డులున్న కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని గుర్తు చేశారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, ప్రధానంగా రైతుల కోసం రైతు భరోసా, పంట నష్ట పరిహారం, పెట్టుబడి రాయితీ భేషరతు నిబంధనలతో రుణ సదుపాయం, ఇతర మార్గాల్లో ఆర్థిక తోడ్పాటును అందిస్తోందని వివరించారు. వరుసగా ఐదో ఏట తొలివిడతలో భాగంగా జిల్లా నుంచి 2,603 మంది కౌలు రైతులకు రూ.1.95 కోట్ల ఆర్థిక సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. వారిలో దేవదాయ భూముల్లో సాగు చేసుకుంటున్న కౌలు రైతులు ఐదుగురు ఉన్నారని, వారికి కూడా ఆర్థిక సాయం అందిందని స్పష్టం చేశారు. వీరితో పాటు ఈ ఏడాది మే, జూన్ నెలల్లో కురిసిన వర్షాలకు 39.54 హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లిందని 182 మంది బాధిత రైతులకు రూ.9.88 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీసీసీబీ చైర్మన్, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా కౌలు రైతులకు, పంట నష్టం వాటిల్లిన రైతులకు సంబంధిత మెగా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన కౌలు రైతులు, జిల్లా వ్యవసాయ అధికారి వీటీ రామారావు, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని, పశు సంవర్ధక శాఖ జేడీ మల్లేశ్వరరావు, సెంట్రల్ బ్యాంకు డీఎం జగన్నాథం, వ్యవసాయ శాఖ ఏడీ అన్నపూర్ణ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ అ'ద్వితీయ'ం



నెల్లిమర్ల రూరల్: సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకన్నపాలెంకు చెందిన జిగిలి తాతకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వసంత

విజయనగరం అర్బన్: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీలో విజయనగరం జిల్లా రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. నెలలో తొలిరోజు శుక్రవారం 86.14 శాతం మంది ఇళ్లకు వెళ్లి వలంటీర్లు పింఛన్లు అందజేశారు. జిల్లాలో 14 రకాల పెన్షన్ లబ్ధిదారులు 2,80,150 మంది ఉండగా, ఒక్క రోజులో 2,41,328 మందికి పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి తెలిపారు. అత్యధికంగా నెల్లిమర్ల అర్బన్‌లో 91.60 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తయింది.



విజయనగరం దాసన్నపేట రథాయాత్ర రోడ్డులో వృద్ధురాలు అప్పయ్యమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రమణమ్మ

ఏసీబీ అధికారులకు చిక్కిన ట్రాన్స్‌కో ఏఈ

విజయనగరం క్రైమ్/మక్కువ:

ఎట్టకేలకు ట్రాన్స్‌కో ఏఈ పోలాకి శాంతారావు ఏసీబీ అధికారులకు చిక్కాడు. నాలుగు రోజులపాటు పరారీలో ఉన్న ఏఈను విశాఖపట్నంలోని సీఎంఆర్ సెంట్రల్ సమీపంలో శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ రామచంద్రరావు తెలిపారు. విద్యుత్ కనెక్షన్ మంజురుకు పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం ములక్కాయవలసకు చెందిన రైతు డి.ఈశ్వరరావు నుంచి ఏఈ రూ.60వేలు డిమాండ్ చేయగా రూ. 20వేలు చెల్లించాడు. ఆగస్టు 27న సాయంత్రం మిగిలిన బ్యాలెన్స్ రూ.40వేలు కారులో ఇస్తుండగా ఏసీబీ అధికారులు ఏఈపై దాడి చేశారు. ఆ సమయంలో అధికారులను గుర్తించిన ఏఈ.. తన కారును వేగంగా పొలాల్లోకి నడిపాడు. ఆయనను వెంబడించిన సీఐను ఢీకొట్టి గాయాలపాలుచేశాడు. పొలాల్లోనే కారును విడిచిపెట్టి పరారయ్యాడు. ఆయన కారును ఏసీబీ అధికారులు సీజ్ చేసి, మక్కువ పోలీసు స్టేషన్‌కు తరలించారు. పరారీలో ఉన్న ఏఈ కదలికలపై నిఘా పెట్టి పట్టుకున్నారు. ఏఈ సమక్షంలోనే విజయనగరంలో ఆయన ఇంట్లో మధ్యాహ్నం సోదాలు జరిపారు. 350 గ్రాముల బంగారం, సుమారు రెండు కిలోల వెండి, ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

అద్దె ఇంటిలోనూ సోదాలు

మక్కువ ఎస్సీకాలనీ సమీపంలో ఏఈ నివసిస్తున్న అద్దె ఇంటిలో ఏసీబీ సీఐ శ్రీనివాసరావు, తన సిబ్బందితో సోదాలు జరిపారు. ఏఈ కుటుంబ సభ్యుల సమక్షంలో వివిధ పత్రాలను పరిశీలించారు. కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసిన ఫైల్స్‌పై ఆరా తీశారు. ఆస్తుల వివరాలపై కుటుంబ సభ్యులను ప్రశ్నించారు. విలువైన డాక్యుమెంట్లు ఏమైనా దొరికాయా? లేదా? అన్న విషయాన్ని ఏసీబీ అధికారులు వెల్లడించలేదు.



విజయనగరంలో ఏఈ శాంతారావు (లుంగీతో ఉన్న వ్యక్తి) ఇంటిలో ఏసీబీ అధికారుల సోదాలు



మక్కువలో ఏఈ నివసిస్తున్న అద్దె ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా రత్నాకర్

పార్వతీపురం: జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా జె.రత్నాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన పార్వతీపురం సహాయ సంచాలకులుగా పనిచేస్తూ పదోన్నతిపై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా నియమితులయ్యారు. జిల్లాలో పశుసంవర్ధక సేవలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు.

ఏరియా ఆస్పత్రిలో ఈహెచ్‌ఎస్ స్కీం

సాలూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఎంప్లాయీస్ హెల్త్ స్కీం కింద వైద్యసేవలు అందజేస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రత్నకుమారి శుక్రవారం తెలిపారు. హెల్త్ కార్డులు ఉన్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఎంప్లాయీస్ హెల్త్‌స్కీం కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఆస్పత్రి సూపరిండెంట్ డా.రత్నకుమారి

ఉత్తమ బోధనకు అవార్డుల పంట

రేగిడి/గుర్ల: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు విజయనగరం జిల్లా నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వారిలో రేగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.ఉమామహేశ్వరి, గుర్ల మండలం పెద్దబంటుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పైడిరాజు ఉన్నారు. వీరిద్దరూ ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజున ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. వీరిని డీఈఓ లింగేశ్వరరెడ్డి, హెచ్‌ఎం వావిలపల్లి లక్ష్మణరావు, ఎంఈఓలు ఎం.వి.ప్రసాదరావు, ఎస్.భానుప్రకాష్, బి.ఎరకయ్య, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

డిజిటల్ బోధనలో మేటి



ఉమామహేశ్వరి

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన బి.ఉమామహేశ్వరి బయాలజీ సైన్సు ఉపాధ్యాయిని. సారాబాయి టీచర్ సైంటిస్ట్ అవార్డ్స్ పోటీల్లో ఈ ఏడాది ద్వితీయ స్థానంలో నిలిచారు. బోధనలో డిజిటల్ టెక్నాలజీ వినియోగంలో ఆమె అందెవేసిన చేయి. ఏడవ తరగతి సామాన్య శాస్త్ర పాఠ్యపుస్తక రచయితగా పనిచేశారు. అతి తక్కువ ఖర్చుతో బోధనాభ్యసన సామగ్రిని తయారీచేయడంలో దిట్ట. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా రెండేళ్లుగా 'ఉమాసైన్సు గురు' అన్నపేరుతో యూ ట్యూబ్ చానల్‌లో 114 సైన్స్ వీడియోలను అందుబాటులో ఉంచారు. ఆమె గైడ్‌గా వ్యవహరించిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో 20 పర్యాయాలు, జాతీయ స్థాయిలో ఐదుసార్లు సైన్సు ఎగ్జిబిషన్‌లకు ఎంపికయ్యారు. జూనియర్ రెడ్‌క్రాస్ ఏర్పాటుచేసి విద్యార్థులతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. నేషనల్ గ్రీన్ కోర్‌లో భాగంగా గోల్డెన్ ఇనిస్టిట్యూషన్ అవార్డును రేగిడి పాఠశాల దక్కించుకునేలా కృషిచేశారు. ఆజాదీకా అమృత మహోత్సవ కార్యక్రమాల్లో రూ.10 వేల ప్రైజ్ మనీని, జిల్లా ప్రస్ట్ ప్రైజ్‌ను గెలుచుకున్నారు. జీవ వైవిధ్యం పోస్టర్ ప్రజంటేషన్‌లో రాష్ట్ర స్థాయిలో బెస్ట్‌టీచర్ అవార్డు పొందారు. 2018లో జిల్లా స్థాయి అవార్డు, 2020లో బెస్ట్ జూనియర్ రెడ్‌క్రాస్ అవార్డు, ఏపీ సైన్స్ కాంగ్రెస్‌లో బయోమెడికల్ విభాగంలో శాస్త్రవేత్తలతో పోటీపడి పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రథమ బహుమతి సాధించారు. ఆమెకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

సంతోషంగా ఉంది



పైడిరాజు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందని పెద్దబంటుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పైడిరాజు తెలిపారు. లవిడాం ప్రాథమిక పాఠశాలకు తాగునీటి సదుపాయం కల్పన, మరుగుదొడ్ల నిర్మాణం, పెద్దబంటుపల్లి పాఠశాలలో గాంధీజీ, సరస్వతీదేవి విగ్రహాల ఏర్పాటు, లవిడాం గ్రామ విద్యార్థులందరూ ప్రభుత్వ బడుల్లోనే చదివేలా కృషిచేయడం, విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధంచేయడం వంటి సేవలకు ప్రభుత్వం గుర్తించి మరింత బాధ్యతను పెంచిందన్నారు.

క్లుప్తంగా

ఘనంగా సీతారామకల్యాణం



నిత్యకల్యాణం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల: పవిత్రపుణ్యక్షేత్రం రామతీర్థంలో శ్రీసీతారామచంద్ర స్వామి నిత్య కల్యాణాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా స్వామివారి సన్నిధిలో అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించారు. అలాగే యాగశాలలో సుందరకాండహవనం, ఆదిత్యహృదయ హవనం, సుదర్శన అష్టకం హవనం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ఆలయంలో ప్రతిరోజూ కల్యాణం నిర్వహిస్తున్నామని భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

వెబ్‌సైట్‌లో ఎన్‌హెచ్‌ఎం పోస్టుల తుదిమెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ హెల్త్ మిషన్) పరిధిలోని ఎన్‌సీయూ, పీపీహెచ్‌సీ, డీఈఐసీల్లో ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించి గత నెల 7వతేదీన ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం తుది జాబితాను విజయనగరం.ఎన్‌ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో వివరాలు చూసుకోవాలని సూచించారు.

సంచార పశు ఆరోగ్య సేవలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలో పోస్టుల భర్తీకి ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఈఎంఆర్‌జీహెచ్‌ఎస్ సంస్థ జిల్లా మేనేజర్ బి.నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యుల పోస్టులకు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత కలిగిన వారు, ఉద్యోగ విరమణ చేసిన వారు అర్హులని తెలిపారు. పారావెట్‌కు డిప్లమా ఇన్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత కలిగిన వారు, డ్రైవర్ పోస్టుకు 10 వతరగతి ఉత్తీర్ణులైన వారు, హెవీ లైసెన్స్ కలిగి, 2 ఏళ్ల అనుభవం ఉన్నవారు అర్హులని తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు వైజంక్షన్‌లో ఉన్న పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో దరఖాస్తుతో పాటు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9154970175 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కలెక్టరేట్ ఉద్యోగాలని నమ్మించిన నిందితుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: కలెక్టరేట్‌లో తాము పీఆర్ ఓలమని కంప్యూటర్ అసిస్టెంట్ ఉద్యోగాలిప్పిస్తానని నమ్మబలికి లక్ష రూపాయలు అడ్వాన్స్‌గా తీసుకునే క్రమంలో అది మోసమని బయటపడింది. దీంతో వెంటనే బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశారు. ఈ సంఘటనపై వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కలెక్టరేట్‌లో తాము పీఆర్ ఓలమని కంప్యూటర్ అసిస్టెంట్ ఉద్యోగాలను ఇప్పిస్తానని నిందితులు పిల్లి నరసింగరావు, సిమ్మ లక్ష్మిలు..అనకాపల్లి జిల్లా సీతానగరం గ్రామానికి చెందిన ఎస్.సుంకర పోతురాజును నమ్మబలికారు. పోతురాజు, ఆయన భార్యకు ఉద్యోగాలిప్పిస్తామని అందుకు రూ.11 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. ఈ క్రమంలో లక్ష రూపాయలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు గాను కలెక్టరేట్‌కు శుక్రవారం వచ్చిన పోతురాజుకు అక్కడే పనిచేస్తున్న మిత్రుడు కనిపించాడు. మిత్రుడికి విషయం చెప్పేసరికి ఉద్యోగాలిప్పిస్తామన్నవారు మోసగాళ్లని తేలింది. దీంతో పోతురాజు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు నరసింగరావు, లక్ష్మిలను అరెస్టు చేసి కేసు నమోదుచేశారు.

జనం గుండెలో ఓ జ్ఞాపకం

గలగలమని పరవళ్లు తొక్కుతూ పొలాలకు పరుగుతీస్తున్న సాగునీటిని చూసినా..రోగుల కళ్లలో ఆరోగ్య భరోసా కనిపించినా..పదిలంగా ఉన్న చిన్నారుల హృదయాలను తట్టినా.. లక్షాధికారులుగా మారిన మహిళామణుల ఆర్థికాభివృద్ధిని గమనించినా..పెద్ద చదువులు చదివిన పేదింటి పిల్లలను కదిలించినా వారి మార్పుకు కారణభూతుడుగా చెప్పేది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు మాత్రమే. ముఖ్యమంత్రిగా తన పరిపాలనలో చెరగని ముద్ర వేసిన ఆయన ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించారు. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రిగా ఆయన హయాంలో ప్రజలకు చేసిన మేలు గురించి ఓ సారి గుర్తు చేసుకుని నివాళులర్పిద్దాం.

- అన్ని వర్గాలకు అండగా నిలిచి..
- ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం
- నేడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి




ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స పొందుతున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: తీవ్రమైన కరువుతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోజులవి. పంటలు పండక , పెట్టుబడికి తెచ్చిన అప్పులు తీర్చలేక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిడుతున్న కాలమది. పేదోడికి కేన్సర్, గుండె జబ్బు వస్తే వైద్యం చేయించుకోవడానికి అస్తులు అమ్ముకోవాల్సిన దీనస్థితి. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితి. 2004కు ముందు ఉండే ఈ పరిస్థితులను తన పాదయాత్ర సందర్భంగా గమనించిన దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే సంక్షేమ కార్యక్రమాలను తన పాలనలో చేపట్టారు.

ఆరోగ్య ప్రదాతగా చిరస్థాయి గుర్తింపు

పేద, మధ్య తరతి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం కోసం దివంగత నేత వై.ఎస్. రాజశేఖరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈపథకం కింద తెలుపు రేషన్ కార్డు కలిగిన వారికి ఆరోగ్యశ్రీ కార్డులు అందించారు. ఆరోగ్యశ్రీ కార్డు పట్టుకుని ప్రభుత్వ ఆస్పత్రి అయినా, కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లినా ఉచితంగా చికిత్స అందించేవారు. అంతేకాకుండా ఇంటికి వెళ్లడానికి ప్రయాణ చార్జీలు కూడా అందించేవారు. కార్పొరేట్ ఆస్పత్రులను ఎప్పుడూ కన్నెత్తి చూడని పరిస్థితి పేదవారిది. అలాంటిది ఆరోగ్యశ్రీ కార్డు చూపిస్తే చాలు స్వాగతం పలికి మరీ వైద్యం చేసేవారు. ఉత్తరాంధ్రలో పేద, మధ్యతరగతి వారే అధికం.జిల్లాలో 2007లో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. ఆరోగ్య శ్రీ కార్డు కలిగిన ఎంతో మందికి ఆస్పత్రుల్లో చికిత్స అందించే సాయం చేసి పునర్జన్మ ప్రసాదించి ఆరోగ్య ప్రదాతగా పేరుగాంచారు.

వైఎస్ హయాంలో మడ్డువలసకు మహర్దశ



వంగర: మడ్డువలస ప్రాజెక్టు

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మహర్దశ పట్టింది. ప్రాజెక్టు నిర్మాణం అనంతరం నీట మునిగిన ఆరు గ్రామాల నిర్వాసితులు భూములు, ఇళ్ల, ఖాళీ స్థలాలు, రవాణా ఖర్చుల కోసం 2007వ సంవత్సరంలో రూ.27 కోట్లు మంజూరు చేసి నిర్వాసితులకు న్యాయం చేశారు. 4500 కుటుంబాలకు న్యాయం చేశారు. అలాగే మడ్డువలస ప్రాజెక్టుతోపాటు కుడి ప్రధాన కాలువ నుంచి 50 కిలోమీటర్ల పొడవు వరకు ఆధునికీకరణ పనులు చేసేందుకు మహానేత హయంలో ఆ ఫైలుకు రూ.47 కోట్లతో ఆమోదం లభించింది. దీంతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని తొమ్మిది మండలాల్లో 31వేల ఎకరాల పంటపొలాలకు పుష్కలంగా సాగునీరందుతోంది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

104 ద్వారా పల్లె ముంగిట వైద్య సేవలు:

ఆస్పత్రులకు వెళ్లలేని వారికి కోసం పల్లె ముంగిటకు వెళ్లి వైద్య సేవలు అందించడం 104 వాహనాలను ప్రవేశపెట్టారు. బీపీ, సుగర్, ఆస్తమా, మూర్ఛ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ముందులు అందించేవారు. అదేవిధంగా గర్భిణులకు తనిఖీలు చేసేవారు. పిల్లలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ముందులు అందించేవారు.

రైతులకు రుణ విముక్తి

2004 కు ముందు తీవ్ర కరువు పరిస్థితులు ఉండేవి. అన్నదాతలు పంట సాగుకు తెచ్చిన అప్పులు తీర్చలేక అత్మహత్యలకు పాల్పడేవారు. మరి కొంత మంది గ్రామాలు విడిచి వెళ్లేపోయేవారు. పంటలు పండక రైతులు సతమతమవుతుంటే బ్యాంకులు రుణాలు తీర్చాలని ఒత్తిడి చేసేవి. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యే పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతుల రుణాలను పూర్తిస్థాయి మాఫీ చేసి అండగా నిలిచారు. అంతేకాకుండా వారికి తిరిగి రుణాలు ఇప్పించారు. రుణాలు సక్రమంగా చెల్లించిన రైతులకు ప్రోత్సాహకంగా రూ.5 వేలు చొప్పున చెల్లించారు.

అపరభగీరథుని ఆశయ ప్రతిరూపం పెద్దగెడ్డ రిజర్వాయర్



సాలూరు: పెద్దగెడ్డ ప్రాజెక్టు

సాలూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుర్తులు సాలూరు నియోజకవర్గంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అపరభగీరథుడైన దివంగత ముఖ్యమంత్రి వైస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయానికి నిలువెత్తు రూపం పాచిపెంట మండల కేంద్రంలోని పెద్దగెడ్డ జలాశయం. పుష్కలంగా నిండిన నీటితో రిజర్వాయర్, జలకళను సంతరించుకున్న సందర్భంలో, రిజర్వాయర్ కింద వేల ఎకరాలకు సాగునీరు అంది పచ్చని పైరుల పలకరింపులో దివంగత ముఖ్యమంత్రి వైస్ రాజశేఖర్ రెడ్డి గుర్తులు కనిపిస్తూనే ఉంటాయి. పెద్దగెడ్డ రిజర్వాయర్ పేరు చెప్పగానే ఇక్కడి ప్రజలకు గుర్తువచ్చేది ముందుగా రాజశేఖర్‌రెడ్డే. జలయజ్ఞంలో భాగంగా ఇక్కడ ప్రజలకు తాగు నీరు, రైతులకు సాగునీరు అందించే ఉద్దేశంతో పాచిపెంట పెద్దగెడ్డ రిజర్వాయర్‌ను నిర్మించారు.

వైఎస్సార్ కుటుంబం రైతు పక్షపాతి



రైతుల కష్టాలు రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రల్లో క్షేత్రస్థాయిలో చూశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో రాష్ట్రంలో తొలిసారిగా పాచిపెంట పెద్దగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి ఆయనే ప్రారంభించారు. మామిడిపల్లిలో బురదాలమ్మ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నియోజకవర్గంలో ప్రాజెక్టుల ఆధునికీకరణకు కోట్లాది రుపాయలు మంజూరుచేశారు. తండ్రి, తనయుల పాలనలో పనిచేయడం నా అదృష్టం.

– పీడిక రాజన్నదొర, ఉపముఖ్యమంత్రి గిరిజన సంక్షేమశాఖామంత్రి

రైలు ఢీకొని వ్యక్తి మృతి



రైల్వే ట్రాక్‌పై శ్రీహరినాథ్ బాబు మృతదేహం

కొమరాడ/కురుపాం : కురుపాం మండలం శివ్వన్నపేట గ్రామానికి చెందిన కొండేటి గౌరీశంకర్ రావు(39) కొమరాడ మండలం గుమడ సమీపంలో రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రత్నాకర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గుమడ గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమత్తం పార్వతీపురం జిల్లా అస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ పేర్కొన్నారు.

గూడ్స్ ఢీకొని మరొకరు..

పార్వతీపురంటౌన్: పట్టణంలోని బెలగాం రైల్వేస్టేషన్ వద్ద గూడ్స్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ప్రమాదంపై జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురంలోని బంగారమ్మ కాలనీకి చెందిన గద్ద శ్రీహరినాథ్ బాబు(42), తల్లి లక్ష్మి పార్వతీపురం బెలగాం రైల్వేస్టేషన్ ట్రాక్ దాటుతుండగా గమనించని శ్రీహరినాథ్‌బాబును గూడ్స్ ఢీకొంటున్న సమయంలో తల్లి అప్రమత్తమై లాగేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అక్కడికక్కడే మృతిచెందాడు. తనయుడిని బతికించుకోవాలని తల్లి చేసిన ప్రయత్నంలో ఆమె చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

శుభకార్యానికి వెళ్తూ అనంతలోకాలకు..

- స్కూటీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- భర్త మృతి, భార్యకు గాయాలు



శ్రీనివాసరావు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం(గాజువాక): అగనంపూడిలో శుభకార్యానికి వెళ్తున్న భార్యాభర్తల స్కూటీని బస్సు ఢీకొనడంతో భర్త అక్కడికక్కడే దుర్మరణం చెందగా భార్య స్వల్పగాయాలతో బయటపడింది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం, నరవ గ్రామానికి చెందిన మానాపురం శ్రీనివాసరావు (57) తన భార్య పద్మతో కలిసి అగనంపూడిలోని ఫ్యామిలీ ఫ్రెండ్ ఇంట్లో శుభకార్యానికి శుక్రవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. షీలానగర్ నుంచి గాజువాక వైపు వెళ్తున్న క్రమంలో నాతయ్యపాలెం పంప్ హౌస్ ఎదురుగా అనకాపల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీరి వాహనాన్ని ఢీకొంది. శ్రీనివాసరావు తూలి పడిపోగా అతని తలపై నుంచి బస్సు వెనుక టైర్ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూటీ వెనుక కూర్చున్న పద్మ స్వల్పగాయాలతో సురక్షితంగా బయట పడింది. సంఘటన స్థలానికి చేరుకున్న గాజువాక ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్‌ఐ కొల్లి సతీష్ వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. శ్రీనివాసరావుప్రైవేట్ పనులు చేస్తుంటాడని బంధువులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ పరారయ్యాడు.

రాజన్నదొర ఆద్వర్యంలో నేడు వైఎస్సార్ వర్ధంతి



వైఎస్సార్ అక్షరమాలలో విద్యార్థులు

సాలూరు: ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో శనివారం సాలూరు నియోజకవర్గంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా సాలూరు పట్టణంలో వైఎస్సార్ విగ్రహానికి రాజన్నదొర పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు తరలిరావాలని ఉపముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు శుక్రవారం ఓ ప్రకటనలో కోరాయి.

వైఎస్సార్ అక్షరమాలలో విద్యార్థులు

వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సాలూరు పట్టణంలోని వెంకటవిద్యాగిరి పాఠశాల విద్యార్థులు వైఎస్సార్ అక్షర మాలగా రూపొంది ఆయనకు నివాళులు అర్పించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

లక్కవరపుకోట: మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన సీల వెంకటరమణ(56) ఆర్థిక ఇబ్బందులు తాళలేక చెట్టుకొమ్మకు ఉరివేసుకుని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఎల్.కోట ఎస్సై ముకుందరావు, స్థానికులు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస మండలంలోని శారద కర్మాగారం క్యాంటీన్‌లో వంటమనిషిగా వెంకటరమణ పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం కిరాణా సామగ్రి తీసుకొస్తానని భార్యకు చెప్పి గోల్డ్‌స్టార్ జంక్షన్‌కు వచ్చాడు. 12 గంటలు దాటినా తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య వాకబు చేయగా గ్రామానికి వచ్చే దారిలో గల మామిడి తోటలో చెట్టు కొమ్మకు ఉరివేసుకుని ఉండడం స్థానికులు గుర్తించి ఆమెకు చెప్పారు. ఈ మేరకు ఆమె ఎల్.కోట పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఎస్సై ముకుందరావు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా చేసి పోస్ట్‌మార్టం నిమిత్తం ఎస్.కోట సీహెచ్‌సీకి మృతదేహాన్ని తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇద్దరు కుమార్తెలకు వెంకటరమణ పెళ్లిళ్లు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

విశాఖలో బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



సబ్‌జూనియర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు

విజయనగరం: విశాఖ వేదికగా జరుగుతున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారులు శుక్రవారం పయనమయ్యారు. ఈనెల 1వ తేదీ నుంచి 3 వ తేదీ వరకు సబ్ జూనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహిస్తుండగా..జిల్లా నుంచి 9 మంది క్రీడాకారులు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ప్రాతినిధ్యం వహిస్తారు. బాలికల విభాగంలో ఎం.సంజన మోల్, ఎస్.దాక్షిణ్య, ఎం.డి.నిషాద్ ఫాతిమా,వై. రేణుశ్రీ, వై.హిమబిందులు అంతర్ జిల్లాల పోటీలకు జిల్లా తరఫున పోటీ పడనుండగా..బాలుర విభాగంలో ఎం.తరుణ్, సీహెచ్. మేఘ్ వర్ష, ఎ.విజయ్ చైతన్య, ఎం.చరణ్‌తేజలు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో తలపడతారు. రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు క్రీడాదుస్తులు అందజేశారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ కోలగట్ల వీరభద్రస్వామి, అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ వీఎస్‌ప్రసాద్, ఎంకేబీ శ్రీను, ప్రధాన కార్యదర్శి వై.కుసుంబచ్చన్; కార్యదర్శి నున్న సురేష్‌లు క్రీడాకారులను అభినందించారు.

వ్యాయామ విద్యలో పీహెచ్‌డీ

- పట్టా అందుకున్న ధర్మవరపు రాంబాబు



ఆచార్య నారాగార్జున యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ పట్టేట్ చేతుల మీదుగా పీహెచ్‌డీ అందుకుంటున్న ధర్మవర్మపు రాంబాబు

విజయనగరం: వ్యాయామ విద్యపై మక్కువ పెంచుకుని అదే రంగంలో రాణిస్తున్న నెల్లిమర్ల మండలం సారిపల్లి గ్రామానికి చెందిన ధర్మవరపు రాంబాబు వ్యాయామ విద్యలో పీహెచ్‌డీ సాధించారు. ఎఫెక్ట్ ఆఫ్ ప్లయోమెట్రిక్ ట్రైనింగ్ అండ్ రెసిస్టెన్స్ ట్రైనింగ్ ఆన్ సెలెక్టెడ్ ఫిజికల్, ఫిజియాలజికల్ అండ్ సైకాలజికల్ వేరిబుల్స్ అంశంపై పరిశోధన చేసినందుకు గాను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ రాజశేఖర్ పట్టేట్ చేతుల మీదుగా గత నెల 29న పట్టా అందుకున్నారు. తన పరిశోధనకు సహకారం అందించిన నాగార్జున యూనివర్సిటీ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.జాన్సన్‌కు ఈ సందర్భంగా రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఆయన తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రాంబాబు పీహెచ్‌డీలో సాధించటం పట్ల వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

విశ్వగురువుగా తీర్చిదిద్దడమే నాభూమి నా దేశం

విజయనగరం టౌన్: తరతరాలుగా ప్రజల్లో నాటుకుపోయిన వలసవాద మనస్తత్వ ఆలోచనలు తొలగించి, అభివృద్ధి చెందిన భారతదేశంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేసి, భారత దేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దడమే ప్రధాని నరేంద్రమోడీ తలపెట్టిన నా భూమి –నా దేశం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు పేర్కొన్నారు. స్థానిక రింగురోడ్డులో ఉన్న బీజేపీ జిల్లా కార్యాలయంలో అసెంబ్లీ కన్వీనర్లు, మండలాధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామీణ భారతానికి ప్రాధాన్యతనిస్తూ , మట్టి విలువను తెలియజేస్తూ, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేస్తూ , దేశం కోసం సర్వస్వం అర్పించిన వీరుల స్ఫూర్తిని ప్రతిఒక్కరిలో నింపాలన్నదే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ప్రధానమంత్రి మోడీ ప్రవేశపెట్టిన ఐదుసూత్రాల నుంచి ప్రేరణ పొందుతూ ఏర్పాటుచేసిన నా భూమి–నా దేశం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, పార్టీ నాయకులు గద్దె బాబురావు, తీగల హరినాథ్, నడుకుదుటి ఈశ్వరరావు, కోటగిరి నారాయణరావు, బొబ్బిలి శ్రీను, అప్పలాచారి, ఉత్తరావల్లి మోహనరావు, పతివాడ రాజేష్, బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, బూర్లె శ్రీధర్, మరిశర్ల రామారావు, గొడ్డు పద్మ, ఎస్‌వీఎల్ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముద్దాయికి పదేళ్ల జైలుశిక్ష

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విజయనగరం జిల్లా వల్లంపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2016లో నమోదైన వరకట్నం వేధింపులు, హత్యానేరం కేసులో ముద్దాయికి పదేళ్ల జైలుశిక్ష, రూ. 5వేలు జరిమానా విధిస్తూ విజయనగరం 1వ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి.రజని శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వేపాడ మండలం, ఆతవ గ్రామానికి చెందిన కళిరెడ్డి సన్యాసినాయుడికి విశాఖపట్నం జిల్లా, కె.కోటపాడు మండలం, సూదివలస గ్రామానికి చెందిన పార్వతితో 2013, మే నెలలో వివాహం జరిగింది. ఆ దంపతులకు ఒక పాప జన్మించింది. కొన్నాళ్ల తరువాత అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా పార్వతిని వేధిస్తూ, కన్నవారింటికి సన్యాసినాయుడు వెళ్లగొట్టాడు. తరువాత కొన్నాళ్లకు బాగా చూసుకుంటానని నమ్మించి తిరిగి కాపురానికి తీసుకువచ్చాడు. అయితే మళ్లీ యథాప్రకారం అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తుండేవాడు. భర్త ప్రవర్తనలో ఎటువంటివంటి మార్పు రాకపోవడంతో మనస్తాపం చెందిన పార్వతి 2016 మార్చి 10న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయింది. ఈ విషయమై పార్వతి తల్లి వర్రి లక్ష్మి ఫిర్యాదు మేరకు అప్పటి వల్లంపూడి ఎస్సై ఎం.కృష్ణమూర్తి వరకట్న వేధింపులు, హత్యానేరం కింద కేసు నమోదు చేశారు. అప్పటి విజయనగరం డీఎస్పీ టి.వెంకటరత్నం దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో ముద్దాయి సన్యాసినాయుడికి కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹144	₹258	₹ 268